క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఆదరణ కరువైన పిల్లలు, నేరారోపణ చేయబడిన పిల్లల కేసులను పరిష్కరించేందుకు జిల్లాలోని బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయ మండలిలో సభ్యులను నియమించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి వై.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని గురించి పూర్తి నోటిఫికేషన్, అర్హతల వివరాలు, దరఖాస్తు ఫారం ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. ఆసక్తిగల, అర్హతగల అభ్యర్థులు వెబ్‌సైట్ వివరాలు, అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని ఏప్రిల్ 9వ తేదీ లోగా డైరెక్టర్, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ, విజయవాడకి పంపించాలన్నారు. వివరాలకు జిల్లా పర్యవేక్షణ అధికారి సెల్ నంబర్ 90301 53369లో సంప్రదించవచ్చన్నారు.

నాలా చట్టం రద్దు సరికాదు

బోట్‌క్లబ్: నాలా చట్టం రద్దు రాష్ట్ర భవిష్యత్‌కు భస్మాసుర హస్తంగా తయారవుతుందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1963 నుంచి నాలా చట్టం భూమి యజమాన్యానికి సంబంధించిన చట్టపరమైన అంశాలను నియంత్రించే సాధనంగా ఉందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లకు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రమేష్, ఉపాధ్యాయ సంఘాలు

బాలాజీచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లకు పలు ఉపాధ్యాయ సంఘాలు రూపొందించిన పోస్టర్‌ను గురువారం డీఈఓ పిల్లి రమేష్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి 2025–26 ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు తల్లిదండ్రులకు వివరించి, ఈ వేసవిలో ప్రత్యేక డ్రైవ్ చేపడతాయని ఉపాధ్యాయ సంఘ నాయకులు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరించిన వారిలో యంగ్‌మైండ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వాకాడ వెంకట రమణ, ఎస్‌టీయూ, టీఎన్‌ఎస్‌యూ, ప్రధానోపాధ్యాయుల సంఘ సభ్యులు ఉన్నారు.

లాడ్జిలో వ్యక్తి మృతి



పాతపాటి ప్రదీప్ మృతదేహం

కాకినాడ క్రైం: స్థానిక బాలాజీ చెరువులోని వసుధ లాడ్జిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణా జిల్లా రాయనగరం గ్రామానికి చెందిన పాతపాటి ప్రదీప్ (41) బాంబినో సేమియా కంపెనీలో ఏరియా సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కాకినాడలో ఉన్న డిస్ట్రిబ్యూటర్లను కలిసేందుకు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి వస్తుంటాడు. ఈ క్రమంలోనే బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ నుంచి కాకినాడకు వచ్చి వసుధ లాడ్జిలో దిగాడు. బుధవారం రాత్రి గదిలో మద్యం సేవించాడు. ఉదయం రూం బాయ్ చూసే సరికి విగత జీవిగా పడి ఉన్నాడు. గుండె పోటుతో మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమాజాన్ని ప్రభావితం చేసేది నాటకం



రంగస్థల నటుడు అనిల్‌ను సత్కరిస్తున్న సత్యనారాయణ

బోట్‌క్లబ్: సమాజాన్ని ప్రభావితం చేసేది నాటక రంగమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ రంగస్థల నటుడు బొట్టా అనిల్‌ను సత్కరించారు. సామాజిక సమస్యలు పరిష్కరించడానికి మానవ హక్కులను ప్రోత్సహించడానికి నాటక రంగం ఒక వేదికగా పనిచేస్తుందన్నారు. ప్రముఖ రంగస్థల నటుడు బొట్టా అనిల్ మాట్లాడుతూ నాటక రంగం సాంస్కృతిక, భాషాపరమైన అడ్డంకులను అధిగమించే ప్రపంచ భాష అన్నారు.

గర్భగుడి నుంచి జాతి గర్వించేలా..

- నిండు జీవితానికి రెండు సూత్రాలు
- తుది అంకానికి అంగన్‌వాడీల శిక్షణ
- పిండం నుంచి ప్రాథమిక దశ వరకు శిశువు చైతన్యానికి దోహదం



పిల్లల ఆటలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న అరుణశ్రీ, ప్రభావతి



తరగతి నిర్వహిస్తున్న సీడీపీవో, శిక్షకులు దయామణి, ప్రభావతి

కాకినాడ క్రైం: పిల్లలు బాగుంటే కుటుంబం.. కుటుంబం బాగుంటే సమాజం.. సమాజం బాగుంటే దేశం బాగుంటుంది. ఈ మహా మంత్రాన్ని పసి మనసులను చైతన్యవంతం చేయడం నుంచే ప్రారంభించాలి. చిన్నారుల భవిత బంగారమయ్యేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ మార్గ నిర్దేశంలో స్త్రీ శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'పోషణ్ భీ పడాయి భీ' రూపుదిద్దుకుంది. రెండు సూత్రాలతో ఓ సరికొత్త ఆలన ద్వారా పాలనకు ప్రభుత్వం సిద్ధమైంది. అవే నవచేతన, ఆదర్శిల. వీటిపై జిల్లా స్థాయి అధికారులు జాతీయ స్థాయిలో శిక్షణ పొంది క్షేత్రస్థాయికి విస్తరిస్తున్నారు. పసిమొగ్గలకు అన్నీ తామై వ్యవహరిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి కార్యక్రమ ప్రయోజనాలను చంటిపిల్లలకు అందించే ఏర్పాట్లు చేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ విజయకుమారి, కాకినాడ సెక్టార్ సీడీపీవో జ్యోతి సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ అంగన్‌వాడీ బృందానికి రెండు దశల్లో ఇస్తున్న శిక్షణ తుది అంకానికి చేరింది.

దిగ్విజయంగా శిక్షణ

కాకినాడలో యాళ్లవారి గరువు ప్రాంతంలోని డాక్టర్ ఎస్ఆర్‌కే మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎనిమిది రోజుల వ్యవధిలో రెండు బ్యాచ్‌ల చొప్పున, ఒకొక్క బ్యాచ్‌కి మూడు రోజుల చొప్పున శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 20న ప్రారంభమైన శిక్షణ 27వ తేదీతో ముగియనుంది. సీడీపీవో జ్యోతి పర్యవేక్షణలో, సూపర్‌వైజర్లు ప్రభావతి, దయామణి, అరుణశ్రీ, అరుణ దుర్గాంబిక బోధకులుగా వ్యవహరిస్తున్న ఈ శిక్షణకు కాకినాడ ప్రాజెక్టు పరిధిలోని 170 అంగన్వాడీ సెంటర్లకు చెందిన 170 మంది టీచర్లు రెండు విడతల్లో 85 మంది చొప్పున హాజరయ్యారు. ఆసక్తిదాయకమైన నూతన అంశాల బోధనే ప్రధానంగా సాగిన శిక్షణ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

పిండం ఊపిరిపోసుకున్న క్షణం నుంచే..

తల్లి గర్భంలో పిండం ఊపిరిపోసుకున్న క్షణం నుంచే శిశు రక్షణ ప్రారంభం కావాలనే లక్ష్యంతో ఈ శిక్షణ రూపుదిద్దుకుంది. జననానికి ముందు జననానికి తర్వాత శిశువు పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆరోగ్యకరమైన జీవితానికి దోహదపడే అంశాలు, పుట్టిన వెంటనే తీసుకోవలసిన సంరక్షణ, మెదడు, దేహం పెరుగుదల, మానసిక, శారీరక వికాసం తదితర అంశాల సంయుక్త మేళవింపుతో శిక్షణను పూర్తి ఫలవంతంగా తీర్చి దిద్దారు. అందులో నవచేతన, ఆదర్శిల అనే రెండు కొత్త సూత్రాలే అత్యంత కీలకం.

ఆదర్శిల...

ఆదర్శిల 3 నుంచి 6 ఏళ్ల వయసు పిల్లల కోసం నిర్దేశించింది. ఈ దశలో మెదడు ఎదుగుదల 15 శాతం . నేర్చుకోవడమే ఈ దశలో పిల్లలకు అవసరమయ్యే బోధన. ఆటపాటలతో, పుస్తకాలు, బిజీ టైం టేబుళ్ల ఒత్తిడి లేకుండా పాఠశాల క్రమశిక్షణకు అలవాటు చేయడమే ఈ దశ లక్ష్యం. ఆదర్శిల సూత్రంలో ఈ విషయాలు బోధిస్తారు. తగిన వ్యాయామం, ఆటపాటలు, మానసిక ఉల్లాసం, నేర్చుకోవడంపై తపన, కొత్త అంశాల పరిచయం, వాటిపై పిల్లల ఆసక్తి, చేసే పనుల్లో క్రియాశీలత, దివ్యాంగులకు బోధించే ప్రత్యేక విధానం వంటివి ఈ ప్రక్రియ ద్వారా బోధిస్తూ ఆ ప్రయోజనాలను పిల్లలకు బదలాయిస్తారు. తద్వారా వారిని ప్రాథమిక పాఠశాలలకు వెళ్లేందుకు సంసిద్ధం చేస్తారు.

నవచేతన

నవ చేతన అంటే తల్లి గర్భంలో పిండం రూపుదిద్దుకున్న తొలి రోజు నుంచే అందివ్వాల్సిన సంరక్షణను బోధించే సూత్రీకరణ. మూడేళ్ల వరకు నవ చేతన సంరక్షణ పిల్లలకు అందుతుంది. గర్భం దాల్చడం మొదలు శిశువుకు మూడేళ్లు వచ్చే వరకు అత్యంత కీలక దశ అని నవచేతనలో బోధిస్తారు. అలాగే శిశువుకి 85 శాతం మెదడు ఎదిగే దశ కూడా ఇదే. అందుకే అత్యంత కీలకంగా ఈ దశను పరిగణిస్తారు. గర్భంలో ఉన్న శిశువు సంరక్షణలో తల్లి ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా 21 రకాల వ్యాధులు, లోపాలతో పిల్లలు పుట్టే అవకాశం ఉంది. అందుకే నవచేతనలో పిండ దశ నుంచి మూడేళ్ల లోపు వయసున్న పిల్లల కోసం సంరక్షణ విధులు బోధిస్తున్నారు.

ప్రత్యేక బోధనా విధానం



ప్రత్యేక బోధనా విధానంలో శిక్షణ ఇస్తున్నాం. పిల్లల్ని నేర్చుకోవడం వైపు ఆకర్షితులయ్యే ఆటపాటల విధానాలపై అంగన్వాడీ కార్యకర్తలకు తర్ఫీదు ఇస్తున్నాం. చిత్రలేఖనం, చార్ట్ ప్రజెంటేషన్ల ద్వారా కార్యకర్తల మెదడుకూ పదును పెడుతున్నాం. పీడీ విజయకుమారి పర్యవేక్షణలో కాకినాడ ప్రాజెక్టు పరిధిలో శిక్షణ ప్రయోజనకరంగా కొనసాగుతోంది.

– అనుసూరి జ్యోతి, సీడీపీవో, కాకినాడ ప్రాజెక్టు

ఎంపీపీగా అనంతలక్ష్మి

- మొత్తం 10 మంది సభ్యులు హాజరు
- ఒకే నామినేషన్ రావడంతో ఎన్నిక లాంఛనం



ఎంపీపీగా ఎన్నికైన నందిపాటి అనంతలక్ష్మికి ధ్రువీకరణ పత్రం అంజేస్తున్న ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వెంకటలక్ష్మి

కాకినాడ రూరల్: పండూరు–1 ఎంపీటీసీ నందిపాటి అనంతలక్ష్మి ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల పీఓగా డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, పరిశీలకునిగా జేసీ రాహుల్ మీనా హాజరయ్యారు. మొత్తం 18 మంది ఎంపీటీసీ సభ్యులకు పది మంది హాజరు కాగా జనసేన నుంచి గెలుపొందిన ముగ్గురు సభ్యులు, వైఎస్సార్ సీపీ తరఫున గెలుపొంది ఇటీవల జనసేనలో చేరిన ఏడుగురు వారిలో ఉన్నారు. ఉదయం పది గంటలకు ఎంపీపీ ఎన్నికకు నామినేషన్లను ఆహ్వానించగా నిర్ణీత సమయానికి పండూరు 1 జనసేన ఎంపీటీసీ నందిపాటి అనంత లక్ష్మి నామినేషన్ దాఖలవడంతో 11గంటలకు ఎన్నిక నిర్వహించారు. ఆమెను పండూరు 2 ఎంపీటీసీ నందిపాటి వెంకట శ్రీనివాస్ ప్రతిపాదించగా నేమాం ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ గుత్తుల సత్తిబాబు బలపరిచారు. ప్రిసైడింగ్ అధికారి వెంకటలక్ష్మి సూచన మేరకు సభ్యులు చప్పట్లద్వారా మద్దతు తెలిపారు. అనంతరం ఎంపీపీగా గెలుపొందిన అనంతలక్ష్మికి పీఓ వెంకటలక్ష్మి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఎంపీటీసీలతో కలిసి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ 100 శాతం స్ట్రైక్ రేట్ ఉన్న జనసేనకు ఎంపీపీగా అనంతలక్ష్మి ఎన్నిక మరో విజయమన్నారు.

ఎన్నికను బహిష్కరించిన వైఎస్సార్ సీపీ



ఎంపీపీ ఎన్నికను వైఎస్సార్ సీపీ సభ్యులు బహిష్కరిస్తున్నట్లు ప్రకటిస్తున్న జెడ్పీటీసీ రామకృష్ణ

కాకినాడ రూరల్: ఎంపీపీ ఎన్నికను తమ పార్టీ ఎంపీటీసీ సభ్యులు బహిష్కరిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ ప్రకటించారు. ఎన్నికకు గంట ముందు ఆయన కాకినాడ రమణయ్యపేట వైద్యనగర్‌లో మీడియా సమావేశంలో ఈ విషయం వెల్లడించారు. కాకినాడ రూరల్‌లో 18 మంది ఎంపీటీసీలకు 15 మంది వైఎస్సార్ సీపీ వారే అన్నారు. జెంటిల్‌మెన్ ఒప్పందం ప్రకారం ఎంపీపీగా గోపిశెట్టి పద్మజ రెండున్నరేళ్లు పనిచేసి తరువాత రెండున్నర ఏళ్లు పుల్ల వెంకటలక్ష్మి కోసం రాజీనామా చేయడంతో ఎంపీపీ పదవి ఖాళీ అయ్యిందన్నారు. ఈ పదవి కోసం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను కూటమి నాయకులు, జనసేన పార్టీ నాయకులు ప్రలోభాలకు గురిచేసి, భయపెట్టి తమ వైపు తిప్పుకున్నారన్నారు. తమకు మద్దతు ఇవ్వకపోతే మీ ఇళ్లను కూలగొడతామని, మీ బంధువుల ఉద్యోగాలు తీయిస్తామని భయపెట్టి లాక్కోవడం దురదృష్టకరమన్నారు. 9 నెలల్లో అభివృద్ధికి మేము అడ్డు చెప్పామా మా పార్టీ వాళ్లు జెంటిల్‌మెన్ ఒప్పందం చేసుకుంటే ఎంపీపీ తీసుకోవడం వల్ల మీకు లాభమేమిటని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, నాయకులు గోపుశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని ప్రోత్సహించాలి



నాటకరంగ కళాకారులను సత్కరించిన అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన నాటక రంగాన్ని ప్రజలు ఆదరించడంతో పాటు ప్రభుత్వం కూడా ప్రోత్సహించాలని నాటక కళాకారుడు ఎ.దక్షిణామూర్తి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం నిర్వహించారు. కళాకారుడు జీవీకే మోహన్‌రావు మాట్లాడుతూ నేడు నాటక రంగం ఆధునికతను సంతరించుకుంటూ సామాజిక, రాజకీయ సమస్యలను సార్వజనీనంగా రచిస్తూ సమగ్రంగా చూపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో నాటక రంగ కళాకారులు ఎ.దక్షిణామూర్తి, జీవీకే మోహన్‌రావు,జి.సత్యానందం, బర్రె సత్యనారాయణ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు, రాజా, ప్రసాద్ నాయుడు, వై.కృష్ణ, మల్లీశ్వరి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి





వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన తులసీకుమార్, రాజాబాబు యాదవ్

బాలాజీచెరువు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో గురువారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తపల్లి జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, పార్టీ కాకినాడ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, కాకినాడ స్మార్ట్ సిటీ మాజీ అధ్యక్షుడు అల్లి రాజాబాబు మర్యాద పూర్వకంగా కలిసారు. బలహీన వర్గాలకు అండగా నిలవాలని జగన్ సూచించారని వారు తెలియజేశారు.

మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్

పెట్రోలు బంకు యజమానికి కమిషనర్ హెచ్చరిక



పెట్రోలు బంకు యజమానితో మాట్లాడుతున్న కమిషనర్ ఇతర అధికారులు

సామర్లకోట: మొండి బకాయిలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో రెడ్ నోటీసులు జారీ చేశారు. ఏడీబీ రోడ్డులోని రెండు పెట్రోలు బంకుల యజమాని భారీ మొత్తంలో బకాయి ఉండడంతో గురువారం కమిషనర్ తన సిబ్బందితో కలిసి హెచ్చరిక జారీ చేశారు. తనకు ఉన్న భవనాన్ని కూల్చి వేసి ఖాళీ స్థలంగా మార్చినా ఇంటి పన్ను పంపుతున్నారని ఇది ఎంత వరకు సమజసమని బంకు యజమాని సత్యదేవ్ ఆమెను ప్రశ్నించారు. బకాయిలు చెల్లించిన సమయంలో వాటిని సర్దుబాటు చేస్తామని అతనికి ఆమె వివరించారు. అలాగే ఏడీబీ రోడ్డులోని పెట్రోలు బంకుకు రూ. ఆరు లక్షలకు మించి ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని నిర్లక్ష్యం చేస్తే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవలసి ఉంటుందని కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్ జట్ల మోహన్ బకాయిల చెల్లింపునకు రెండు రోజులు గడువు ఇవ్వాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేయడంతో గడువు ఇచ్చారు. ఆర్వో శ్యామల, ఆర్ఐ పి.సురేంద్రకుమార్, మేనేజరు కనకరాజు, బిల్లు కలెక్టర్ గిడుతూరి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది కమిషనర్ వెంట ఉన్నారు. పట్టణంలోని మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

సబ్ జైలులో విచ్చలవిడిగా గంజాయి





జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం సిమెంట్ రేకులపై వెళ్తున్న వ్యక్తులు

- పర్యవేక్షణను పట్టించుకోని అధికారులు
- నిద్రావస్థలో నిఘా కెమెరాలు

కాకినాడ లీగల్: వివిధ నేరాలపై కాకినాడ స్పెషల్ సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న నిందితులకు గంజాయి, గుట్కా, ఖైనీ ఇతర మత్తు పదార్థాలు యథేచ్ఛగా అందుతున్నాయి. జైలు లోపల, బయట సీసీ కెమేరాలు ఉన్నప్పటికీ వాటి పర్యవేక్షణ లేకుండా పోయింది. గురువారం రిజిస్ట్రార్ కార్యాలయం బిల్డింగ్ పైకి ఎక్కి నిందితులకు మత్తు పదార్థాలు అందించడం చర్చనీయాంశమైంది. నిందితులతో స్నేహితుల ఇంటర్వ్యూ సమయంలో, కోర్టు వాయిదా సమయంలో వారితో మాట్లాడి ఫలాన సమయానికి వేస్తాం తీసుకోమని చెప్పడం, నిందితులు ఆ సమయానికి అక్కడ ఉండి వాటిని తీసుకుని మత్తు పదార్థాలను వినియోగిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ముప్పు

సబ్ జైలులో నిందితుల కోసం వారి స్నేహితులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అందించేందుకు సబ్ రిజిస్ట్రారు కార్యాలయం బిల్డింగ్ పైకి ఎక్కి అక్కడ నుంచి సబ్‌జైలు లోపలికి వేస్తున్నారు. అయితే జిల్లా రిజిస్ట్రారు కార్యాలయంలో కోట్లాది రూపాయల విలువైన డాక్యుమెంట్లు, ఇతర ఫైల్స్ ఉంటాయి. ఇప్పటికే బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకుంది. తాజాగా గంజాయి బ్యాచ్ బిల్డింగ్ పైకి ఎక్కి సిమెంట్ రేకులను తొక్కేస్తుండడంతో అవి ముక్కలై వర్షాకాలంలో నీరు కారి ఫైళ్లు పాడవుతున్నాయి. దీనిపై కోర్టు గార్డులు (పోలీసులు), సబ్ రిజిస్ట్రార్ అధికారులు, స్పెషల్ సబ్‌జైలు అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సమస్యలు పరిష్కరించాలి

బాలాజీచెరువు: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలంటూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గురువారం జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. 12వ పీఆర్‌సీ త్వరగా వేయాలని, ఐఆర్ 27శాతం ప్రకటించడంతో పాటు మార్చి 31వ తేదీనాటికి సరెండర్ లీవ్ క్యాష్‌బిల్లు విడుదల చేయాలన్నారు. 60 ఏళ్లు దాటిన వారిని ఎస్ఎస్‌సీ స్పాట్ వ్యాల్యుయేషన్ నుంచి మినహాయించాలని, అలాగే పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలని కోరారు. ఒకేషనల్ టీచర్లతో వేసవి సెలవుల్లో ఒక పూట మాత్రమే పనిచేయించాలని సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా అధ్యక్షుడు జి.స్వర్ణలత, జనరల్ కార్యదర్శి ఎస్.సూర్యవెంకట ప్రసాద్ ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో 11 మందికి రెండు రోజుల చొప్పున జైలు, 17 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. వివరాల్లోకి కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. గురువారం వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

వీఆర్‌కు హెచ్‌సీ నాయుడు

కాకినాడ క్రైం: ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న హెచ్‌సీ నాయుడును వీఆర్‌కు పంపుతూ ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలు ఇచ్చారు. పిఠాపురం రూరల్ ఎస్సై ఎల్.గుణశేఖర్ అవినీతిపై విచారిస్తున్న ఏసీబీ అధికారులు నాయుడు పాత్రను గుర్తించారు. పిఠాపురం మండలం పి.దొంతమూరు గ్రామానికి చెందిన సానబోయిన గంగరాజు, కిల్లాడి దుర్గాప్రసాద్‌లపై 2024 అక్టోబర్‌లో నమోదైన అట్రాసిటీ కేసు నుంచి తప్పించేందుకు ఎస్ఐ గుణశేఖర్ లంచం డిమాండ్ చేయడం, ఈ నెల 24న రాత్రి లంచం తీసుకుంటూండగా ఏసీబీ అధికారులు అతనితో పాటు అతడి డ్రైవర్‌ని పట్టుకున్న విషయం తెలిసిందే. లోతైన విచారణ చేసిన అధికారులు వారి సెల్‌ఫోన్లలోని యూపీఐ లావాదేవీలను పరిశీలించి డీఎస్పీ కార్యాలయంలో అట్రాసిటీ కేసులు పరిశీలిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఏవీఎల్ఎన్ సింహాద్రి నాయుడు అలియాస్ నాయుడు పాత్ర ఉన్నట్టు ఆధారాలు గుర్తించారు. దీంతో ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు నాయుడు ను వీఆర్‌కు పంపారు.

అంగన్‌వాడీల్లో సేవలు అందించాలి

పిఠాపురం: పిల్లల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి సూచించారు. మండలం చిత్రాడ జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. మూడు రోజుల పాటు నిర్వహించిన పోషణ్ భీ.. పడాయి భీ కార్యక్రమంలో పొందిన శిక్షణను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మణి పలువురు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రైల్వే భద్రతకు ప్రాధాన్యం ఇవ్వండి



సామర్లకోట రైల్వే గేటు వద్ద ట్రాక్ పాయింట్లను పరిశీలించిన ఈడీ

- ఈడీ సేఫ్టీ తనిఖీ
- అధికారులకు పలు సూచనలు

సామర్లకోట: రైల్వే భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (న్యూఢిల్లీ) బీఎం తిరుపతి అన్నారు. గురువారం సాయంత్రం సామర్లకోట రైల్వే స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. సిగ్నల్ వ్యవస్థ, రైల్వే కేబిన్లు, రైల్వే గేట్లు, రైలు ట్రాక్ జాయింట్లపై ఆయన తనిఖీలు చేశారు. రైల్వే ఆస్తులను కాపాడటంతో పాటు ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. రాబోయే రోజులలో రైళ్ల వేగం మరింత పెరిగే అవకాశం ఉండడంతో పర్యవేక్షణ కీలకమన్నారు. స్టేషన్లలోని సమస్యలను తమ దృష్టికి తీసుకు రావడం ద్వారా బోర్డులో ఆమోదించి నిధులు మంజూరు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, రికార్డులను స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆయనకు వివరించారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి తీర్థం

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాద్‌లో పోలేరమ్మ తల్లి తీర్థాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దున్నపోతును తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేసి గరగ నృత్యాల మధ్య దానిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద బారుతీరి పడుకున్న భక్తుల పైనుంచి ఓ భక్తురాలు దున్నపోతును నడిపించింది. అనంతరం ఆలయంలో అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. మండలం నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి కార్యక్రమాన్ని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మూలపేటలో వేంచేసి ఉన్న పోలేరమ్మ తల్లి తీర్థం ఘనంగా నిర్వహించారు.

బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

పెద్దాపురం: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు బంగారమ్మ గుడివీధికి చెందిన బత్తిన భారతి (55) పని నిమిత్తం నడిచి వెళ్తుండగా మున్సిపల్ సెంటర్‌లోని అంబేడ్కర్ బొమ్మ వద్ద నల్లమిల్లి వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీ కొంది.

ఈ ప్రమాదంలో బస్సు ఆమె కాలి మీద నుంచి వెళ్లడంతో తీవ్ర గాయమైంది. స్థానికులు ఆమెను వెంటనే పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఉగాది కవి సమ్మేళనం

పెద్దాపురం: స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సాహితి ప్రవంతి కార్యదర్శి కొత్త శివ తెలిపారు.

గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పెద్దాపురం సాహితి ప్రవంతి, యూటీఎఫ్, ప్రజా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది సాహిత్య సభ, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్టు తెలిపారు. కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శివ కోరారు.

ఆన్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

పిఠాపురం: గ్రామ పంచాయతీల్లో జీపీడీపీ ఆన్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని డీపీఓ రవి కుమార్ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం మూడు పంచాయతీల్లోనే ఆన్‌లైన్ పనులు పూర్తయ్యాయని మిగిలిన 7 పంచాయతీల్లో వెంటనే పూర్తి చేయాలని ఆయన ఈఓపీఆర్‌డీ కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.